సాక్షి ప్రకాశం

శనివారం । 7 । జనవరి । 2023



15 రోజులు.. 8 దొంగతనాలు
మార్కాపురం పట్టణంలో 15 రోజుల వ్యవధిలో 8 దొంగతనాలు జరిగాయి. దీంతో ప్రజలు హడలెత్తిపోతున్నారు. పోలీసుల పనితీరుపై విమర్శలు వినిపిస్తున్నాయి.- 8లో..



ముంపు గ్రామాల ప్రజలకు న్యాయం చేస్తా
వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు న్యాయం చేస్తామని మంత్రి సురేష్ అన్నారు. - 8లో..

వాతావరణం
గరిష్టం/కనిష్టం 29 /21
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. వాతావరణంలో తేమ శాతం అధికం.

న్యూస్‌రీల్

కంభంలో జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్

కంభం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో ఈనెల 8 నుంచి జిల్లా స్థాయి టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ బహుమతుల కింద రూ.20 వేలు, రూ.10 వేలు ఇవ్వనున్నట్లు చెప్పారు. పాల్గొనదలచిన జట్లు 7వ తేదీ సాయంత్రంలోగా ఎంట్రీఫీజు రూ.600 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9912952145, 8885605822 నంబర్లను సంప్రదించాలని కోరారు.

11న ప్రకాశం, నెల్లూరు జిల్లాల స్థాయి క్రికెట్ టోర్నీ

పామూరు: మండలంలోని కంబాలదిన్నె గ్రామంలో సంక్రాంతి సంబరాలు కార్యక్రమంలో భాగంగా అబ్దుల్‌కలాం స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 11వ తేదీ ఉదయం 9 గంటలకు ప్రకాశం, నెల్లూరు రెండు జిల్లాల స్థాయిలో క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ సభ్యులు తెలిపారు. టోర్నీలో పాల్గొనేందుకు ఆసక్తిగల వారు ఈనెల 9వ తేదీ రాత్రి 7 గంటల్లోగా రూ.1000 ఎంట్రీఫీజు చెల్లించి తమ జట్ల వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. టోర్నీలో విజేతలకు ప్రథమ బహుమతి రూ.25 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.20 వేలు, ట్రోఫీ, మ్యాన్‌ఆఫ్‌ది సిరీస్ అందిస్తారన్నారు. వివరాలకు సెల్: 9398863157, 9010821278 నంబర్లను సంప్రదించాలన్నారు.

అంతర్జాతీయ కరాటే పోటీలకు మార్కాపురం విద్యార్థులు



అంతర్జాతీయ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

మార్కాపురం టౌన్: అంతర్జాతీయ కరాటే పోటీలకు మార్కాపురం పట్టణంలోని వివేకానంద విద్యాపీఠం స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం యక్కలి రామకోటేశ్వరరావు, ఇన్‌చార్జ్ డి.తాజుద్దీన్ శుక్రవారం తెలిపారు. కరాటేలోని ఒక భాగమైన స్కవోయి చాంపియన్ షిప్ పోటీలు ఈనెల 2 నుంచి 4 వరకు జమ్మూకాశ్మీర్‌లో జరగ్గా, వాటిలో పాల్గొని గెలుపొందారన్నారు. దీంతో ఈనెలాఖరులో వీరు నేపాల్‌లో జరిగే అంతర్జాతీయ పోటీలకు వెళతారని చెప్పారు. ఎంపికైన విద్యార్థులు కె.విష్ణువర్ధన్‌రెడ్డి, హుస్సేన్‌బాషా, యాసిన్‌బాషా, జోయాలను పాఠశాల యాజమాన్యం శుక్రవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో అభినందించారు.

ఎన్‌హెచ్‌ఎం జేఏసీ క్యాలెండర్ ఆవిష్కరణ

ఒంగోలు అర్బన్: ఏపీ ఎన్‌హెచ్‌ఎం జేఏసీ నూతన సంవత్సర క్యాలెండర్‌ను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి రాజ్యలక్ష్మి శుక్రవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఉద్యోగుల సంక్షేమానికి జేఏసీ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు భగీరథి, పద్మజ, ఇతర జేఏసీ కార్యవర్గ సభ్యులు చల్లా ప్రభాకర్ రెడ్డి, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

సీబీఎస్ఈ సిలబస్ బోధనపై అవగాహన అవసరం

- డీఈవో బి.విజయభాస్కర్

ఒంగోలు: సీబీఎస్ఈ సిలబస్ బోధనపై అవగాహన పెంపొందించుకోవాలని సీబీఎస్ఈ సిలబస్ బోధించేందుకు ఎంపికైన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వారి సహాయకులను డీఈవో బి.విజయభాస్కర్ ఆదేశించారు. స్థానిక ఒంగోలు జవహర్ నవోదయలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 2023–24 నుంచి వెయ్యి పాఠశాలలు రాష్ట్రంలో సీబీఎస్ఈలోకి మారుతున్నాయన్నారు. వాటిలో మన జిల్లాలో 63 పాఠశాలల్లో సీబీఎస్ఈ పాఠ్య ప్రణాళికలను అమలు చేస్తారన్నారు. పాఠశాలను ఏ విధంగా అనుబంధం పొందాలి, ఆన్‌లైన్ అఫిలియేషన్ స్కూల్స్ ఇన్ఫర్మేషన్ సిస్టం గురించి ఆరా తీశారు. అఫిలియేషన్ తెచ్చుకునేందుకు ఉన్న సమస్యలను వివరించారు. పరీక్ష పద్ధతులు, గ్రేడింగ్ విధానంపై అవగాహన కల్పించారు. బోర్డు ఏదైనా క్షేత్ర స్థాయిలో విలువలతో కూడిన విద్యను అందించాలన్నారు. భవిష్యత్తులో సీబీఎస్ఈ విద్యావిధానంపై మరింత అవగాహన కల్పించేందుకు శిక్షణ కార్యక్రమాలు ముమ్మరం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏఎంఓ సుబ్బారావు, కోర్సు డైరెక్టర్ టి.కిషోర్‌బాబు, నోడల్ ఆఫీసర్ కె.పూర్ణచంద్రరావు, రిసోర్సు పర్సన్లు రమాదేవి, రమణయ్య, అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

గెలాక్సీపై కరోనా బండ



చీమకుర్తిలోని గ్రానైట్ క్వారీ

చీమకుర్తి గెలాక్సీ గ్రానైట్‌ను కరోనా నీడ వీడడం లేదు. ఈ మహమ్మారి కారణంగా ఎగుమతుల్లేక పరిశ్రమపై తీవ్రప్రభావం పడింది. రెండేళ్లుగా ఒడిదుడుకులు ఎదుర్కొంటోంది. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన చేయూతతో కొంత నిలదొక్కుకున్నా చైనాలో లాక్‌డౌన్ విధించడంతో ఎగుమతులు పూర్తిగా నిలిచిపోయాయి. గ్రానైట్ యజమానులంతా లోకల్ మార్కెట్‌పైనే భారం వేసి నెట్టుకొస్తున్నారు.

- చైనాలో కోవిడ్ విజృంభణతో నిలిచిన గ్రానైట్ ఎగుమతులు
- ప్రభుత్వానికి తగ్గిన రాబడి
- భారమంతా లోకల్ మార్కెట్‌పైనే
- కార్మికుల ఉపాధిపైనా ఆందోళన

చీమకుర్తి: జిల్లాలో చీమకుర్తి మండలం ఆర్‌ఎల్ పురం పంచాయతీ పరిధిలోని దాదాపు 3 వేల హెక్టార్లలో విస్తరించి ఉన్న గెలాక్సీ గ్రానైట్‌కు ప్రపంచ వ్యాప్తంగా మంచి గిరాకీ ఉంది. ఇక్కడ నుంచి చైనా దేశానికి 90 శాతం గెలాక్సీ గ్రానైట్ ఎగుమతవుతుంది. మిగిలిన 10 శాతం బంగ్లాదేశ్, ఈజిప్ట్, తైవాన్, పాకిస్తాన్ దేశాలకు వెళుతుంది.

2 లక్షల క్యూబిక్ మీటర్లకు పడిపోయిన ఎగుమతులు:

చీమకుర్తి మండలం ఆర్.ఎల్.పురం పరిధిలో 105 గెలాక్సీ గ్రానైట్ క్వారీలున్నాయి. వాటి ద్వారా 2021 డిసెంబర్ వరకు నెలకు 60 వేల నుంచి 70 వేల క్యూబిక్ మీటర్ల గెలాక్సీ గ్రానైట్‌ను ఎగుమతి చేసేవారు. ఏడాదికి 7 లక్షల నుంచి 8 లక్షల క్యూబిక్ మీటర్ల రాయిని తరలించేవారు. దానిలో 90 శాతం అంటే దాదాపు 5–6 లక్షల క్యూబిక్ మీటర్లు గెలాక్సీ గ్రానైట్ కేవలం చైనా దేశానికి పంపేవారు. మిగిలింది చిన్న చిన్న దేశాలైన తైవాన్, బంగ్లాదేశ్, ఈజిప్ట్, పాకిస్తాన్ వంటి దేశాలతో పాటు లోకల్ మార్కెట్‌లోని గ్రానైట్ ఫ్యాక్టరీలకు సరఫరా అవుతుంది. ప్రస్తుతం చైనాకు ఎగుమతి అయ్యే 5–6 లక్షల క్యూబిక్ మీటర్ల గెలాక్సీలో కేవలం 2 లక్షల క్యూబిక్ మీటర్లకు మించి ఎగుమతి కావడం లేదు. గడిచిన నెల రోజుల వ్యవధిలో చైనాలో కరోనా దుర్భర పరిస్థితుల కారణంగా పూర్తిగా గ్రానైట్ ఎగుమతులు నిలిచిపోయాయని గ్రానైట్ యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎగుమతులు పడిపోతుండటంతో క్వారీల్లో తీసే ప్రొడక్షన్ కూడా సగానికి పైగా తగ్గించేశారు. ఒక్కో క్వారీ నుంచి క్వారీ సామర్థ్యాన్ని బట్టి నెలకు 2 వేల క్యూబిక్ మీటర్ల నుంచి 50 వేల క్యూబిక్ మీటర్ల వరకు రాళ్లను తీసే క్వారీలున్నాయి. వాటిలో ఇప్పుడు ప్రతి క్వారీ నుంచి సగానికి పైగా కూడా తీయడం లేదు. ఇదిలా ఉండగా చీమకుర్తి, బూదవాడ, ఒంగోలు, గుండ్లాపల్లి, మార్టూరు వంటి ప్రాంతాల్లో కలిపి మొత్తం సుమారు 2 వేల గ్రానైట్ ఫ్యాక్టరీలున్నాయి. వాటిలో రామతీర్థంలోని గెలాక్సీ గ్రానైట్ రాళ్లను వినియోగించే ఫ్యాక్టరీలు కేవలం 400 మాత్రమేనని యజమానులు పేర్కొంటున్నారు. చైనాకు ఎగుమతులు ఆగిపోవడంతో లోకల్ మార్కెట్‌కు సరఫరా చేసేందుకు గ్రానైట్ యజమానులు సిద్ధంగా ఉన్నప్పటికీ 1600 ఫ్యాక్టరీలలో బల్లికురవ, గురిజేపల్లి, బ్లాక్ గ్రానైట్, కనిగిరి గ్రానైట్ రాళ్లను వినియోగిస్తున్నారు.



కార్మికుల ఉపాధిపైనా ప్రభావం

చైనాకు ఎగుమతులు పడిపోవడంతో గ్రానైట్ క్వారీల్లో పనిచేసే కార్మికులపై తీవ్ర ప్రభావం పడింది. ఒకప్పుడు క్వారీల్లో ఎగుమతులు బాగున్న రోజుల్లో రోజుకు మూడు షిఫ్టులలో పనిచేసి రేయింబవళ్లు గ్రానైట్ రాయిని తీసేవారు. ఇప్పుడు ఎగుమతులు పడిపోతుండటంతో మూడు షిఫ్టులలో పనిచేసే క్వారీలు రెండు షిఫ్టులలోను, రెండు షిఫ్టులలో పనిచేసే క్వారీల్లో ఒక షిఫ్ట్‌తో సరిపుచ్చుకుంటున్నారు. దీంతో పనిచేసే వారి సంఖ్యను సగానికి పైగా తగ్గించుకుంటున్నారు. ఇలా రామతీర్థంలోని గ్రానైట్ క్వారీల్లో పనిచేసే సుమారు 6 వేల మంది కార్మికులపై దీని ప్రభావం పడుతుందని కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

లోకల్ మార్కెట్ వినియోగం పెంచేలా చర్యలు తీసుకోవాలి



ప్రస్తుతం చైనాకు ఎగుమతులు పూర్తిగా నిలిచిపోయిన తరుణంలో ఇతర రాష్ట్రాలకు సరఫరా చేసే సమయంలో జీఎస్టీని తగ్గించటం, లోకల్ మార్కెట్ వినియోగం పెరిగేలా ప్రభుత్వం సహకరించాలి. రాయల్టీ లో రాయితీలను ప్రకటించి స్లాబ్ విధానాన్ని అమలు చేసి ప్రభుత్వం సహకారం అందిస్తే గెలాక్సీ గ్రానైట్‌కు పూర్వ వైభవం వస్తుంది.
– ఎంఏ అజీమ్, షాహిన్ గ్రానైట్ యజమాని, రామతీర్థం

గడిచిన ఏడాదిలో రూ.159 కోట్లు ప్రభుత్వానికి నష్టం:



గ్రానైట్ ఎగుమతులు పడిపోవడంతో గడిచిన ఏడాదిలో ప్రభుత్వానికి వచ్చే ఆదాయం భారీగా పడిపోయింది. 2021 డిసెంబర్ నాటికి ప్రభుత్వానికి రూ.328 కోట్లు ఆదాయం రాగా 2022 డిసెంబర్ నాటికి అది రూ.169 కోట్లు మాత్రమే వచ్చిందని జిల్లా గనులు, భూగర్భ శాఖ కార్యాలయం రికార్డులు ధ్రువీకరిస్తున్నాయి. ఈ లెక్కల ప్రకారం ప్రభుత్వానికి ఏకంగా రూ.159 కోట్లు ఆదాయం పడిపోయింది.
– టి.జగన్నాథరావు, మైన్స్ డీడీ, ఒంగోలు

కులమతాలకు అతీతంగా పెన్షన్లు



పెన్షన్ల పంపిణీ సభలో మాట్లాడుతున్న డాక్టర్ ఆదిమూలపు సురేష్

- మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

త్రిపురాంతకం: కుల, మత, ప్రాంత, పార్టీలకు అతీతంగా అర్హులైన వారందరికీ పారదర్శకంగా పెన్షన్లు పంపిణీ చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. త్రిపురాంతకం ఆలయాల వద్ద ట్రిపుల్ కే ట్రస్ట్ హాల్‌లో నిర్వహించిన వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తూచ తప్పకుండా అమలు చేస్తున్న వ్యక్తి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. నవరత్నాల ద్వారా ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి నాందిపలికిందని పేర్కొన్నారు. సంక్షేమం, అభివృద్ధి వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి రెండు కళ్లు అని అన్నారు. రాజకీయాల్లో అధికారం కోసం మాట ఇచ్చి ఎన్నికల అనంతరం మోసం చేయడం పరిపాటిగా మారిన కాలంలో, ఇచ్చిన మాటకు కట్టుబడి పనిచేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఆయన సుదీర్ఘ పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటూ ఎంత కష్టం వచ్చినా, ఎంత ఖర్చైనా వెనకకు తగ్గకుండా వైఎస్సార్ పెన్షన్ పథకాన్ని మూడో సారి పెంచారని అన్నారు. రాష్ట్రంలో ఎనిమిది రకాల పెన్షన్లు 67 లక్షల మందికి అందజేస్తున్నట్లు వివరించారు. గత ప్రభుత్వం 39 లక్షల మందికి వెయ్యి రూపాయలు ఇచ్చి చేతులు దులుపుకున్న విషయాన్ని గుర్తు చేశారు. త్వరలో మూడు వేల రూపాయలను పెన్షన్‌దారులకు అందిస్తామని ఆయన వివరించారు. రాష్ట్ర చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో 151 అసెంబ్లీ స్థానాల్లో అఖండ విజయాన్ని ప్రజలు అందించారని, దానికి తగిన పాలనను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారన్నారు. పెన్షన్లపై ప్రతి పక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, వారికి తగిన గుణపాఠం ప్రజలే చెబుతారని అన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పెన్షన్లు అందిస్తామని అన్నారు. ప్రతిపక్షనేత, 14 ఏళ్లు ముఖ్యమంత్రి అని చెప్పుకునే చంద్రబాబు నాయుడు ఈ ప్రజలకు ఏం చేశారో చెప్పాలని విమర్శించారు.

ఆయన దత్తపుత్రుడు ఈ రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాకుండా అడ్డుకుంటామని ప్రగల్భాలు పలుకుతారని, పది సంవత్సరాలుగా ఆ పార్టీ నిర్మాణాత్మక పాత్ర పోషించిన దాఖలాలు లేవని ఎద్దేవా చేశారు. మంత్రి వెంట డీఆర్‌డీఏ పీడీ బాబూరావు, డీఎల్‌డీవో బీవీఎస్ సాయికుమార్, ఎంపీపీలు కోట్ల సుబ్బారెడ్డి, బెజవాడ పెద్దగురవయ్య, మండా లాజర్, జెడ్పీటీసీ మాకం జాన్‌పాల్, చలమారెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఆర్ సుశీల వెంకట పిచ్చయ్య, తహసీల్దార్ వీ కిరణ్, ఎంపీడీవోలు మరియదాస్, సుబ్బారాయుడు, నాసరరెడ్డి, కుమార్, రాజ్యలక్ష్మి, ఎంఈఓ కే తులసి మల్లికార్జుననాయక్, సర్పంచ్ పొన్నా వెంకటలక్ష్మి, మాజీ ఎంపీపీ ఆళ్ల ఆంజనేయరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్.పోలిరెడ్డి, యల్లారెడ్డి, పాల్గొన్నారు. ఐదు మండలాల కొత్త పెన్షన్‌దారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

- త్రిపురాంతకం మండలం వెల్లంపల్లి వద్ద ప్రారంభించిన మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్



ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

త్రిపురాంతకం: రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకొని గిట్టుబాటు ధర పొందాలని రాష్ట్ర మున్సిపల్ పట్టణాభివృద్ధిశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. త్రిపురాంతకం మండలం వెల్లంపల్లి ఆర్‌బీకే వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేసిందని చెప్పారు. నూతనంగా రైతులకు ఆర్‌బీకేలను ఏర్పాటు చేసి సేవలను అందుబాటులోకి తెచ్చిందని అన్నారు. త్వరలో వెలిగొండ ప్రాజెక్టు ద్వారా ముఖ్యమంత్రి సాగునీరు అందిస్తారని అన్నారు. రైతులు సంక్షేమ పథకాలు పొందేందుకు తగిన విధంగా పథకాలపై అవగాహన పెంపొందించుకోవాలని సురేష్ పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రం ప్రారంభ కార్యక్రమంలో ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ బాబూరావు, మార్కెట్ యార్డు చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, వ్యవసాయశాఖ జేడీఏ ఎస్ శ్రీనివాసరావు, ఏఓ కే నీరజ, పౌరసరఫరాల శాఖ డిస్ట్రిక్ట్ మేనేజర్ గ్లోరియా, అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు ఆర్‌వీ పిచ్చయ్య యాదవ్, ఎస్ పోలిరెడ్డి, సొసైటీ ప్రెసిడెంట్ వెంగళరెడ్డి ఉన్నారు.

జర్నలిజం వైఖరి మారాల్సిన అవసరం ఉంది

- ప్రభుత్వాలపై పగ, ప్రతీకారాలు జర్నలిజంలో ఉండరాదు
- జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య ప్రభుత్వ పరిశీలనలో ఉంది
- మీడియాతో ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు



మాట్లాడుతున్న కొమ్మినేని శ్రీనివాసరావు

ఒంగోలు: ప్రస్తుతం జర్నలిజం ధోరణి భవిష్యత్ తరాలకు శాపంగా మారే పరిస్థితి ఉందని, జర్నలిజం వైఖరి మారాల్సిన అవసరం ఉందని ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం ఒంగోలు వచ్చిన ఆయన స్థానిక ప్రెస్‌క్లబ్‌లో కొద్దిసేపు మీడియాతో మాట్లాడారు. ఈ నేపథ్యంలోనే ప్రస్తుత జర్నలిస్టులకు అవగాహన తరగతులు, మానసిక ఒత్తిడి అధిగమించడం, సమస్యను ఎలా ప్రస్తావించాలనే దానిపై అవగాహన తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. మీడియాలో పెరుగుతున్న పెడధోరణులపై చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ లోపాలను ఎత్తిచూపడం మీడియా విధి అని, కానీ ప్రభుత్వంపై పగ, విద్వేషం, విషంకక్కేలా వార్తలు ఉండరాదన్నారు. ఇటువంటి కథనాల వల్ల జర్నలిజం అటుంచి సమాజానికి తీవ్ర అన్యాయం చేస్తున్నవారంగా మిగులుతాం అన్నారు. ఇటీవల ఒక పత్రిక సంపాదకీయంలో కందుకూరు ఘటన, గోదావరి పుష్కరాలలో ప్రాణాలు కోల్పోయిన ఘటనను రోడ్డు ప్రమాదంలో మరణించిన ప్రమాదాలతో పోల్చడం బాధాకరమన్నారు. 23 మంది ఎమ్మెల్యేలను కొనుగోలుచేస్తే నాడు దానిని అప్రజాస్వామికమని రాయకపోవడం తగదన్నారు. ప్రభుత్వం జారీ చేసిన జీవోలో లోపాలు ఉంటే మీడియా ప్రశ్నించవచ్చని, కానీ రాజకీయ నాయకుల మాదిరిగా వ్యవహరించడం ఎంతవరకు సబబు అన్నారు. తాము ఎటువైపు ఉన్నామో చెప్పకుండా ఇంకో వైపు బద్నాం చేయడం సరికాదని, వారు ఎటువైపు ఉన్నారనే దానిపై స్పష్టత ప్రజలకు ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. జర్నలిస్టులకు సంబంధించిన ఇళ్ల స్థలాల సమస్య ప్రభుత్వ పరిధిలో ఉందన్నారు. అయితే ఎవరు అర్హులనే దానిపై చాలా సమస్యలు వ్యక్తమవుతున్నాయని, మరో వైపు ప్రభుత్వం ఏ పనిచేసినా అది కుంభకోణం అని ఇష్టం వచ్చినట్లుగా రాసేస్తున్న దశలో ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారంలో జాప్యం జరుగుతోందన్నారు. ఇక హెల్త్‌కార్డుల సమస్య, అదే విధంగా యాక్సిడెంటల్ పాలసీ సమస్యలపై తప్పకుండా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామని, త్వరలోనే వాటిని పరిష్కరించేందుకు కృషిచేస్తామన్నారు. సెల్‌ఫోన్ జర్నలిజం కూడా జర్నలిజమే అంటూ చర్చలు జరుగుతున్న నేపథ్యంలో వాస్తవంగా జర్నలిజాన్నే నమ్ముకున్నవారు మాత్రం ఇబ్బందులు పడుతున్నారని, అయినా ప్రభుత్వం దృష్టికి తప్పకుండా సమస్యను తీసుకువెళతామని పేర్కొన్నారు. సమావేశంలో ఒంగోలు ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ఎస్.మాధవరెడ్డి, గౌరవాధ్యక్షుడు మీసాల శ్రీనివాస్, కార్యదర్శి ఎస్‌వీ బ్రహ్మం, కోశాధికారి రాజేష్, గొట్టిపాటి నాగేశ్వరరావు, వెంకట్రావు, నాయక్ పాల్గొన్నారు.

ఉద్యోగ కల్పనలో రాష్ట్ర ప్రభుత్వం ముందంజ

- ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు



జాబ్‌మేళా గురించి ఎమ్మెల్యేకు వివరిస్తున్న కంపెనీ ప్రతినిధులు

కంభం: నిరుద్యోగులకు ఉద్యోగ కల్పనలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందని గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాను ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ జాబ్ మేళాలో 26 మల్టీ నేషనల్ కంపెనీల ప్రతినిధులు హాజరవడంతో నిరుద్యోగులు వారి చదువు, అర్హతను బట్టి ఉద్యోగాలను ఎంపిక చేసుకునే అవకాశం ఉందన్నారు. నిరుద్యోగులు అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉద్యోగంలో చేరి భవిష్యత్‌కు మంచి బాటలు వేసుకోవాలన్నారు. వెనుకబడిన పశ్చిమ ప్రకాశంలోని యువకుల్లో కష్టపడే తత్వం ఎక్కువగా ఉందని, కంపెనీల ప్రతినిధులు వారి శ్రమకు తగ్గ ఫలితం అందేలా ఉపాధి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో గిద్దలూరు మునిసిపల్ చైర్మన్ వెంకట సుబ్బయ్య, జెడ్పీటీసీలు కొత్తపల్లి జ్యోతి, చెన్నువిజయ, సారె వెంకనాయుడు, బండ్లమూడి వెంకటరాజయ్య, అర్ధవీడు ఎంపీపీ వెంకట్రావు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సైమన్ విక్టర్, సర్పంచులు పల్నాటి బోడయ్య, బత్తుల తిరుపాలమ్మ(రజని), జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సయ్యద్ జాకీర్ హుస్సేన్, చేగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, గొంగటి చెన్నారెడ్డి, సబ్బసాని సాంబశివారెడ్డి, కొత్తపల్లి శ్రీను, నరాళ ఈశ్వరరెడ్డి, ఎంపీటీసీలు ఆనంద్, రఫీ, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారులపై కలెక్టర్ కన్నెర్ర

- ముగ్గురు వీఆర్వోలు సస్పెన్షన్
- ఆరుగురు తహశీల్దార్లకు షోకాజ్ నోటీసులు
- ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్ దినేష్ కుమార్

ఒంగోలు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీ సర్వే ప్రక్రియలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై వేటు పడింది. నిరంతరం కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌లు రీ సర్వేపై సమీక్షలు నిర్వహిస్తూ పక్కాగా ప్రక్రియ పూర్తి చేయాలని పలు సార్లు హెచ్చరిస్తున్నా పెడ చెవిన పెట్టిన రెవెన్యూ అధికారులపై కలెక్టర్ చర్యలకు ఉపక్రమించారు. జగనన్న భూహక్కు భూరక్ష పథకం కింద చేపట్టిన రీసర్వే ప్రక్రియకు సంబంధించి నిర్లక్ష్యంగా వ్యవహరించిన రెవెన్యూ అధికారులు, ఉద్యోగులపై కలెక్టర్ దినేష్‌కుమార్ కన్నెర్ర చేశారు. ఆ మేరకు శుక్రవారం ముగ్గురు వీఆర్వోలను సస్పెండ్ చేయడంతో పాటు మరో ఆరుగురు తహశీల్దార్లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. రీ సర్వే ప్రక్రియలో అలసత్వం వహించడం, భూ హక్కు పత్రాల పంపిణీ నిర్లక్ష్యం చేయడంతో పాటు మ్యుటేషన్ ప్రక్రియను సజావుగా చేయకపోవడంతో వీరిపై కలెక్టర్ చర్యలు తీసుకున్నారు. షోకాజ్ నోటీసులు అందుకున్న తహశీల్దార్లలో పిన్నక మధుసూదన్‌రావు (చీమకుర్తి), ఏ బాలకిషోర్ (సీఎస్‌పురం), జి విజయలక్ష్మి (మద్దిపాడు), ఎస్ హరిబాబు (హెచ్‌ఎంపాడు), బీఆర్‌ఎల్‌వీ ప్రసాద్‌రావు (పామూరు), తహశీల్దార్ కే రవిబాబు (అర్ధవీడు) ఉన్నారు. మద్దిపాడు మండలం గార్లపేట వీఆర్వో ఆర్ రవి, పామూరు మండలం ఎల్ఎన్‌పురం వీఆర్వో ఎస్‌కే ఖాసిం, అర్ధవీడు మండలం దొనకొండ వీఆర్వో ఎం ఆంజనేయులను కలెక్టర్ సస్పెండ్ చేశారు.

ఉత్సాహంగా కబడ్డీ పోటీలు



క్రీడల్లో తలపడుతున్న పురుషుల జట్లు

దర్శి: దర్శి పట్టణంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు రెండో రోజు శుక్రవారం ఉత్సాహంగా జరిగాయి. 16 టీంలు పోటీల్లో తలపడ్డాయి. రాత్రి ఫ్లడ్ లైట్ల వెలుగులో జరిగే ఈ పోటీలను తిలకించేందుకు అధిక సంఖ్యలో క్రీడాభిమానులు వచ్చారు. మహిళలు, పురుషులకు విడివిడిగా పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, జీవీరత్నం, నిర్వాహకులు అప్పికట్ల చంగల్రాయుడు, నగరపంచాయతీ వైస్ చైర్మన్ గర్నెపూడి స్టీవెన్ తదితరులు క్రీడలను తిలకించారు.

క్లుప్తంగా

7న సౌత్ ఇండియా బాక్సింగ్ పోటీలు

ఒంగోలు: సౌత్ ఇండియా బాక్సింగ్ పోటీలు ఈ నెల 7వ తేదీ ఒంగోలులో నిర్వహించనున్నట్లు జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి జాన్ మార్క్ తెలిపారు. పోటీలు పేర్నమిట్ట ప్రతిభ కాలేజీ ఆవరణలో మూడు రోజుల పాటు జరుగుతాయన్నారు. నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు, వాకర్స్ మిత్ర బృందంతో కలిసి వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఉదయం 10గంటలకు పోటీలు ప్రారంభమవుతాయన్నారు. కార్యక్రమంలో ఒంగోలు మురళీకృష్ణ, మాజీ కౌన్సిలర్ తన్నీరు సురేష్, అడపా జనార్దన్, నైనాల వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఓవరాల్ చాంపియన్ ఈతముక్కల

కొత్తపట్నం: జిల్లాస్థాయిలో నిర్వహించిన బాలికల ఆటల పోటీల్లో ఈతముక్కల పాలిటెక్నిక్ కాలేజీ విద్యార్థులు ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించారు. జిల్లా స్థాయిలో రెండు రోజుల పాటు నిర్వహించిన ఆటల పోటీలు శుక్రవారంతో ముగిశాయి. 100, 200 పరుగుపందెంలో ఈతముక్కల కాలేజీకు చెందిన వి.జ్యోతి మొదటి బహుమతి సాధించగా, 400, 800 పరుగు పందెం, ట్రిబుల్ జంప్, బాట్మింటన్ సింగిల్స్‌లో సీహెచ్ లక్ష్మి పూజిత విజయం సాధించింది. డిస్కస్‌త్రో ఏ.వైష్ణవి, లాంగ్ జంప్‌లో ఎ.తిరూష్మ ప్రథమ బహుమతి సాధించారు. షాట్‌పుట్‌లో హర్షిణి ప్రథమ బహుమతి సాధించగా, రన్నరగా వైష్ణవి నిలిచారు. ఖోఖో, బ్యాడ్మింటన్(డబుల్), టేబుల్ టెన్నీస్‌లో విన్నర్స్‌గా ఈతముక్కల కాలేజీ విద్యార్థులు నిలిచారు. 100 మీటర్ల పరుగుపందెంలో కూడా ఈతముక్కల కాలేజీ విద్యార్థులు విజేతగా నిలిచారు. వాలీబాల్‌లో విన్నర్‌గా పేస్ కాలేజీ విద్యార్థులు నిలిచారు. వీరంతా రాష్ట్రస్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని ప్రిన్సిపాల్ ఏసుప్రసాదరావు తెలిపారు. పోటీల్లో 120 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు ప్రిన్సిపాల్ ఏసుప్రసాదరావు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఫిజిక్స్ లెక్చరర్ ఆర్‌వీ కృష్ణయ్య, పీడీ భాగ్యారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుండ్లకమ్మ నదిలో పడి వృద్ధురాలి మృతి


వృద్ధురాలి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

మద్దిపాడు: మండలంలోని వెల్లంపల్లి సమీపంలో గుండ్లకమ్మ నదిలో పడి వృద్ధురాలు మృతి చెందింది. మండలంలోని దొడ్డవరం గ్రామానికి చెందిన పులి అక్కమ్మ(80) ఈ నెల 2న శింగరకొండలో ఉంటున్న తన కుమార్తె వద్దకు వచ్చింది. తిరిగి ఈ నెల 5న పెన్షన్ తీసుకునేందుకు గ్రామానికి వస్తుండగా మార్గమధ్యంలో బహిర్భూమికి వెళ్లేందుకు కాలువ వద్దకు వెళ్లగా కాలుజారి పడి మృతి చెందింది. శుక్రవారం స్థానికులు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై శ్రీరాం సంఘటనా స్థలానికి చేరుకొని ఈతగాళ్లతో మృతదేహాన్ని బయటకు తీయించారు. అనంతరం ఆమె ఫొటోను సోషల్ మీడియాలో షేక్ చేయగా..వివరాలు లభ్యమయ్యాయి. మృతురాలి మనవడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


దొంగలు పగులగొట్టిన ఆలయ హుండీ



- వరుస దొంగతనాలతో ప్రజలు హడల్
- పగటి పూటే ఎక్కువ దొంగతనాలు
- చోద్యం చూస్తున్న పోలీసులు

15 రోజులు.. 8 దొంగతనాలు

మార్కాపురం: మార్కాపురంలో దొంగలు పడ్డారు. 15 రోజుల వ్యవధిలో పట్టణంలో 8 దొంగతనాలు జరగడంతో ప్రజలు హడలెత్తిపోతున్నారు. తాళం వేసి మార్కెట్‌కు వెళ్లాలన్నా ఏ వైపు నుంచి దొంగతనం జరుగుతుందో అర్థం కాక భయపడుతున్నారు. వరుస దొంగతనాలతో ప్రజల్లో భయాందోళన నెలకొంది. ఈ దొంగతనాలు పోలీసులకు సవాళ్లుగా మారుతున్నాయి. నేరాలు నిరోధించేందుకు పట్టణంలో వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు నేలచూపులు చూస్తూ నిరుపయోగంగా మారాయి. రాత్రిపూట గస్తీ ఉంటున్నా, పోలీసులు తిరుగుతున్నా దొంగలు మాత్రం తమ పని తాము చేసుకుంటూ పోతున్నారు. విచిత్రం ఏమిటంటే జరిగిన వాటిలో ఎక్కువ దొంగతనాలు పగటి పూట జరగటం గమనార్హం. స్టేషన్‌లో తగినంత సిబ్బంది, హోంగార్డులు ఉన్నా దొంగతనాలు పెరిగిపోవడం పోలీసుల పనితీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

8 దొంగతనాలు..

పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో డిసెంబర్ 23 నుంచి జనవరి 6 వరకు 15 రోజుల వ్యవధిలో 8 ఇళ్లలో దొంగతనాలు జరిగాయి.

- గత నెల 23న ఒకే రోజు పట్టణంలోని 10వ వార్డులో నాలుగిళ్లలో దొంగతనాలు జరిగాయి. అయితే రెండు ఇళ్లలో దొంగల ప్రయత్నాలు విఫలమయ్యాయి. ఒక ఫైనాన్స్ కంపెనీలో రూ.1.30 లక్షల నగదు అపహరించారు.
- నూతన సంవత్సరం 1వ తేదీన మార్కెట్‌యార్డు వద్ద ఉన్న ఆంజనేయస్వామి దేవాలయంలోని హుండీని దొంగలు తీసుకెళ్లి అందులోని రూ.40వేల నగదును తీసుకున్నారు.
- ఈ నెల 2న పట్టణ పరిధిలోని తర్లుపాడు రోడ్డులో వైఎస్ఆర్ కాలనీలో నివాసముంటున్న వేల్పుల వెంకటరెడ్డి ఇంటి తాళాలు పగులగొట్టి రూ.40 వేల నగదు, 10 గ్రాముల బంగారు ఆభరణాలు తీసుకెళ్లారు.
- 3న కంభం రోడ్డులోని వడ్డె బజారులో నివాసముంటున్న హనుమాన్‌సింగ్ ఇంట్లో దొంగలు పడి ఆరున్నర తులాల బంగారు నగలు, రూ.2 వేల నగదు అపహరించారు.
- 5న కరెంటు ఆఫీసు వెనుక నివాసం ఉంటున్న రంగానాయకులు ఇంట్లో తాళాలు పగులగొట్టి బీరువాలో ఉన్న బంగారు ఆభరణాలు, రూ.2 వేల నగదు తీసుకెళ్లారు.

ఇలా వరుసగా పట్టణంలో దొంగతనాలు జరుగుతున్నా పోలీసుల వైపు నుంచి పబ్లిక్ ప్రకటన తప్ప చర్యలు శూన్యం. పట్టణంలో దొంగలు తిరుగుతున్న దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మైకుల ద్వారా హెచ్చరించారు. కొత్త వ్యక్తులు తిరుగుతుంటే తమకు సమాచారం ఇవ్వాలని పట్టణ ఎస్సై శశికుమార్ తెలిపారు. దొంగతనాల నిరోధానికి చర్యలు తీసుకుంటున్నామని, వివిధ ప్రాంతాల్లో నిఘా ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు.


పనిచేయని సీసీ కెమెరా

ముంపు గ్రామాల ప్రజలకు
న్యాయం చేస్తా


మంత్రి సురేష్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

- పురపాలక శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

మార్కాపురం: పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ముంపునకు గురవుతున్న గ్రామాల్లోని నిర్వాసితులకు కచ్చితంగా న్యాయం చేస్తామని, అర్హులందరికీ పరిహారం అందుతుందని పురపాలక శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. మార్కాపురంలోని ఆయన నివాసంలో ముంపు గ్రామాల ప్రజలతో పాటు వైఎస్సార్ సీపీ పెద్దారవీడు మండల కన్వీనర్ పి.కృష్ణారెడ్డి, గొట్టిపడియ వైఎస్సార్ సీపీ నేత వేల్పుల చెన్నారెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గాలి వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఇప్పటికే గతంలో కలెక్టర్లు ముంపు గ్రామాల ప్రజలకు పరిహారం ఇచ్చేందుకు అర్హులైన జాబితాతో గెజిట్ ఇచ్చారని, మళ్లీ ఈ నెల 3న మరో గెజిట్‌ను విడుదల చేశారని, ఇందులో పలువురి పేర్లు తొలగించారని మంత్రికి వివరించారు. దీంతో ప్రజల్లో ఆందోళన, అయోమయం నెలకొందని, అర్హులను తొలగించారన్నారు. ప్రాజెక్టు కోసం తరతరాలుగా ఉన్న గ్రామాలను త్యాగం చేసి బయటకు వస్తున్న నిర్వాసితులను ఆదుకోవాలని కోరారు. మంత్రి సురేష్ మాట్లాడుతూ అర్హులందరికీ పరిహారం అందుతుందని, ఎవరికి అన్యాయం జరగదని చెప్పారు. అర్హులను మాత్రం జాబితాలో నుంచి స్వచ్ఛందంగా తొలగించాలని సూచించారు. తాను జిల్లా అధికారులతో మాట్లాడతానని చెప్పారు. మంత్రికి వినతిపత్రం ఇచ్చిన వారిలో బుర్రి వెంకటేశ్వర్లు, సోమయ్య, బాలనాగయ్య, రాజశేఖరరెడ్డి, ఆయా గ్రామాల రైతులు, సర్పంచ్‌లు ఉన్నారు.

నకిలీ నోట్ల ముఠా ఆటకట్టు


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వంశీధర్ గౌడ్


స్వాధీనం చేసుకున్న నకిలీ కరెన్సీ

- ముగ్గురు అరెస్టు..మరొకరు పరారీ
- నకిలీ కరెన్సీ తయారీ సామగ్రి స్వాధీనం

మైదుకూరు: మైదుకూరు పోలీసు సబ్‌డివిజన్ పరిధిలోని దువ్వూరు మండలం కానగూడూరు వద్ద నకిలీ కరెన్సీ నోట్లను చలామణి చేస్తున్న ముఠాను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను తన కార్యాలయంలో డీఎస్పీ వంశీధర్‌గౌడ్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వెల్లడించారు. కానగూడూరులోని పూలమార్కెట్ వద్ద నకిలీ కరెన్సీని చలామణి చేస్తున్నట్టు డీఎస్పీ వంశీధర్ గౌడ్‌కు సమాచారం రావడంతో దువ్వూరు ఎస్‌ఐ ఆర్.రాఘవేంద్రరెడ్డి సిబ్బందితో కలిసి దాడి చేశారు. నకిలీ కరెన్సీని చలామణి చేస్తున్న గుంటూరు జిల్లా మాచర్లకు చెందిన పేర్ల ఏసు అలియాస్ ఏసయ్య, గంగరపు సాగర్‌రెడ్డి, ప్రకాశం జిల్లా గిద్దలూరుకు చెందిన యంగనంపల్లె కోటేశ్వరరావు అనే వారిని అరెస్టు చేశారు. మరొకరు పరారీ అయ్యారు. అరెస్ట్ అయిన నిందితులను విచారణ చేశారు. మైదుకూరులోని కర్నూలు–చిత్తూరు బైపాస్ రోడ్డులో ఉన్న తిరుమల లాడ్జిలో ఉంటూ నకిలీ నోట్లను చలామణి చేస్తున్నట్లు వారు తెలిపారు. పోలీసులు తిరుమల లాడ్జిలో సోదాలు చేశారు. నకిలీ కరెన్సీ తయారీకి ఉపయోగించిన ల్యాప్‌టాప్, కలర్ ప్రింటర్, ల్యామినేటర్, బాండ్ పేపర్స్, కటింగ్ మిషన్, మూడు సెల్ ఫోన్లతో పాటు 59 నకిలీ రూ.200 నోట్లను, 9 ఒకే వైపు ప్రింట్ చేసిన రూ.500 నోట్లను స్వాధీనం చేసుకున్నారు. వారు ఈ నెల 4వ తేదీన మైదుకూరుకు వచ్చి తిరుమల లాడ్జిలో నకిలీ నోట్లను తయారు చేస్తూ చలామణి చేస్తున్నట్టు డీఎస్పీ వంశీధర్ గౌడ్ తెలిపారు. వారిలో ఏసయ్య అనే వ్యక్తిపై గతంలో నకిలీ నోట్ల తయారీ, చలామణిపై వైఎస్సార్ జిల్లా పోరుమామిళ్ల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైనట్టు వివరించారు. నిందితులను కోర్టుకు హాజరుపరుస్తున్నామని, తర్వాత పోలీసు కస్టడీకి తీసుకుని ఎక్కడెక్కడ నకిలీ నోట్లను చలామణి చేశారు, అందులో ఎవరెవరు భాగస్వాములుగా ఉన్నారనే విషయంపై పూర్తి స్థాయిలో విచారణ చేస్తామని డీఎస్పీ పేర్కొన్నారు. ఏసయ్యపై పీడీ యాక్టు పెట్టే విషయమై ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. నిందితులను పట్టుకునేందుకు కృషి చేసిన మైదుకూరు రూరల్ సీఐ ఎన్.నరేంద్రరెడ్డి, దువ్వూరు ఎస్‌ఐ రాఘవేంద్రరెడ్డి, డీఎస్పీ క్రైం పార్టీ ఏఎస్‌ఐలు నాగేంద్ర, రామభూపాల్‌రెడ్డి, కానిస్టేబుళ్లు అమరేశ్వరరెడ్డి, శివశంకరరావులను జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ అభినందించినట్టు తెలిపారు.

8న గ్రూప్-1 పరీక్షలు

- సమాచారం ఫిర్యాదుల కోసం కంట్రోలు రూం ఏర్పాటు

ఒంగోలు అర్బన్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్–1 సర్వీసెస్ పరీక్షలు ఈ నెల 8వ తేదీ నిర్వహించనున్నట్లు కలెక్టర్ కార్యాలయం నుంచి శుక్రవారం అధికారులు ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా కేంద్రం ఒంగోలుతో పాటు టంగుటూరు మండలంలో గ్రూప్–1 పరీక్షలు నిర్వహించేందుకు 7 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల కోసం కలెక్టర్ కార్యాలయంలో ఈ నెల 7వ తేదీ నుంచి 8వ తేదీ వరకు కంట్రోల్ రూము ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షలు రాసే అభ్యర్థులు ఎటువంటి సమాచారం అవసరమైనా, లేదా ఫిర్యాదులు ఉన్నా కంట్రోలు రూం నంబర్ 8801188046 తెలియజేయాలన్నారు.

లైంగిక దాడి కేసులో 10 ఏళ్ల జైలుశిక్ష

సింగరాయకొండ: దివ్యాంగురాలిని వివాహం చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన కేసులో నిందితుడు అరవ పవన్‌కుమార్‌కు పదేళ్ల జైలుశిక్ష, రూ.2 వేల జరిమానా విధిస్తూ ఒంగోలు రెండో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి ఎంఏ సోమశేఖర్ తీర్పు చెప్పారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని ఊళ్లపాలెంలో అరవ పవన్‌కుమార్, జమ్మి కోటేశ్వరమ్మ ఎదురెదురు ఇళ్లలో నివసిస్తున్నారు. 2016 సెప్టెంబర్ 28వ తేదీ మధ్యాహ్నం అరవ పవన్‌కుమార్ వివాహం చేసుకుంటానని దివ్యాంగురాలు జమ్మి కోటేశ్వరమ్మను నమ్మించి శారీరకంగా దగ్గరయ్యాడు. తరువాత నిందితుడు వివాహానికి ఒప్పుకోకపోవడంతో మోసపోయానని గుర్తించి 2016 అక్టోబర్ 2న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ ఎం మురళీకృష్ణ విచారించి కేసు నమోదు చేశారు. కేసు పలు విచారణలు జరగ్గా..పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై కొండారెడ్డి వాదించారు. జడ్జి సోమశేఖర్ నిందితునికి శిక్ష విధించినట్లు ఎస్సై ఫిరోజ్‌ఫాతిమా తెలిపారు.

రానున్న ఎన్నికల్లో జగన్‌ను మళ్లీ సీఎంగా చేద్దాం


పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు


సచివాలయంను ప్రారంభించి లోపల పరిశీలిస్తున్న ఎమ్మెల్యే టీజేఆర్‌సుధాకర్‌బాబు

- పార్టీలతీతంగా సంక్షేమ పథకాలు
- లబ్ధిపొందిన టీడీపీ కార్యకర్తలు స్వాగతించడంపై హర్షం
- రూ.79.3 లక్షలతో సచివాలయం, ఆర్‌బీకే, హెల్త్‌సెంటర్ భవనాలు ప్రారంభోత్సవం

చీమకుర్తి: పార్టీలకతీతంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు అన్నారు. లబ్ధిపొందిన టీడీపీకి చెందిన మహిళలు, కార్యకర్తలు ఎదురేగి పూల వర్షం కురిపిస్తుండటం పట్ల ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం సంతనూతలపాడు మండలం బొడ్డువారిపాలెం, గంగవరం గ్రామంలో ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి స్థానిక గ్రామస్తులు, పథకాలు పొందిన లబ్ధిదారులతో పాటు తెలుగుదేశం పార్టీకి చెందిన పథకాల లబ్ధిదారులు కూడా స్వాగతం పలికి గడప గడపకు బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ లబ్ధిదారులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా గెలిపించుకుందామని విజ్ఞప్తి చేశారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో పార్టీలను పట్టించుకోకుండా సమన్యాయంతో అందిస్తున్నారని తెలిపారు. ఇంటింటికీ తిరిగి పథకాలకు సంబంధించిన బుక్‌లెట్‌లను అందిస్తూ ఒక్కో ఇంటికి ఎంతెంత ప్రయోజనం పొందారో గణాంకాలను వివరించారు. తొలుత బొడ్డువారిపాలెంలో రూ.79.30 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం, రైతు భరోసాకేంద్రం, వైద్య ఆరోగ్య భవనంలను ఎమ్మెల్యే టీజేఆర్ ప్రారంభించారు. ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో సైడు కాలువల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. నూతనంగా మంజూరైన 15 పింఛన్లతోపాటు 427 పెరిగిన పాత పింఛన్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, ఎంపీపీ బీ.విజయ, జెడ్పీటీసీ సభ్యురాలు దుంపా రమణమ్మ, స్థానిక సర్పంచ్ తానిపర్తి వెంకటరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు ఎన్.రాధ, చుట్టుపక్కల గ్రామాల సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, స్థానిక సచివాలయం కన్వీనర్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా వీరసింహారెడ్డి ప్రీరిలీజ్ ఫంక్షన్


మాట్లాడుతున్న హీరో నందమూరి బాలకృష్ణ, వేదికపై హీరోయిన్ శృతిహాసన్

ఒంగోలు: వీరసింహారెడ్డి ప్రీ రిలీజ్ ఫంక్షన్ శుక్రవారం రాత్రి వైభవంగా జరిగింది. హీరో నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ వీరసింహారెడ్డి అభిమానుల అంచనాలను మించి బాగా ఆడుతుందన్నారు. సినిమాను అద్భుతంగా తీర్చిదిద్దారంటూ డైరెక్టర్ మలినేని గోపీచంద్‌ను ప్రశంసించారు. శృతిహాసన్ విజయానికి ఒక చిహ్నం అన్నారు. తనకు నాలుగు అద్భుతమైన సినిమాలు అందించిన బి.గోపాల్ మాత్రమే ఈ వేదికపై సినిమా ప్రీరిలీజ్ ఫంక్షన్‌కు అర్హులంటూ గోపాల్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. తనకు ఛంఘీజ్‌ఖాన్ సినిమా చేయాలనేది చిరకాల కోరిక అని, దానిని తప్పకుండా తీస్తా అంటూ పేర్కొన్నారు. ప్రేక్షకులు, అభిమానులు పెద్ద ఎత్తున వస్తారనే ఉద్దేశంతో పోలీసుల సూచనతో వేదికను మార్చినప్పటికీ 24 గంటల్లో వేదికను అద్భుతంగా తీర్చిదిద్దారంటూ శ్రేయాస్ మీడియాను అభినందించారు. పోలీసులు కూడా ఫంక్షన్ బాగా నిర్వహించుకునేందుకు సహకరించారంటూ పోలీసులను ప్రశంసించారు. డైరెక్టర్ మలినేని గోపీచంద్ మాట్లాడుతూ 1999లో తాను సమరసింహారెడ్డి సినిమా చూసేందుకు ఒంగోలుకు అభిమానిగా వచ్చామని, నేడు అదే హీరోతో తాను సినిమా తీయడం జీవితంలో మర్చిపోలేని అనుభూతన్నారు.

వాసన్నకు కృతజ్ఞతలు:

24 గంటల్లో వేదిక మార్చాల్సిన అవసరం వచ్చినప్పుడు వేదిక మార్పునకు సహకరించిన ఒంగోలు శాసనసభ్యుడు బాలినేని శ్రీనివాసరెడ్డి, పోలీసుశాఖ వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. హీరోయిన్ శృతిహాసన్, హనీరోజ్‌లు ప్రేక్షకులకు సంక్రాంతి శుభాకాంక్షలు ప్రకటించారు. సీనియర్ డైరెక్టర్ బి.గోపాల్ ప్రసంగించారు. కార్యక్రమంలో భాగంగా హీరోయిన్ శృతిహాసన్‌తో, చంద్రిక రవి అద్భుతంగా నృత్యం చేసి ప్రేక్షకులను అలరించారు. కార్యక్రమంలో నిర్మాతలు నవీన్ ఎర్నేని, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ చందు, నటులు దునియా విజయ్, అజయ్‌ఘోష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు


కబడ్డీలో తలపడుతున్న చీరాల, మార్కాపురం బాలుర జట్లు


జావలెన్ త్రో విసురుతున్న విద్యార్థి

ఒంగోలు: పాలిటెక్నిక్ జిల్లాస్థాయి ఆటల పోటీలు రెండో రోజు శుక్రవారం ఉత్సాహంగా సాగాయి. షటిల్ బ్యాడ్మింటన్ సింగిల్స్, డబుల్స్, వాలీబాల్, కబడ్డీ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభను చాటారు. షటిల్ బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో పి.జీవన్‌కుమార్ (అద్దంకి ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ), జి.విజయ్‌కాంత్(వేటపాలెం సెయింట్ ఆన్స్), షటిల్ బ్యాడ్మింటన్ డబుల్స్‌లో జి.నాగగణేష్, ఎం.హరికృష్ణ (చీరాల ఇంజినీరింగ్ కాలేజీ), జి.వెంకట శివతేజ, జి.విజయ్‌కుమార్ (సెయింట్ ఆన్స్ వేటపాలెం) మధ్య జరిగింది. వాలీబాల్ ఫైనల్స్ డీఏ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ఒంగోలు- పేస్ కాలేజీ జట్ల మధ్య జరగనుంది. కబడ్డీ ఫైనల్స్‌కు సెయింట్ ఆన్స్ వేటపాలెం చేరుకుంది. రెండో ఫైనల్ జట్టు శనివారం రైజ్ కాలేజీ–పేస్ కాలేజీ జట్ల మధ్య జరిగే పోరులో తేలనుంది. శనివారంతో పోటీలు ముగుస్తాయి.